కవితా కౌముది

# వరండా

టి.జ్ఞానప్రసూన

మీఇంటికి వరండా వుందా?
లేకపోతే ఒకటి కట్టించుకోండి
అపరిచితులకి. ఆశ్రయం ఇవ్వవచ్చు
ఆత్మీయులకిఅతిధ్యం ఇవ్వవచ్చు
ఇంటికి వాకిలికి మధ్యవర్తి వరండా
నిజానికి ఇది ఇల్లుకాదు, వాకిలికాదు
ఇల్లు , వాకిలి రెండూ కూడా
స్నేహితులతో వరండాలో కూర్చుని
కాఫీయో,టీయో బిస్కెట్లతోనూ
కారప్పూసతోనూ
కొంచెం కొంచెం సేవిస్తుంటే
ఎన్ని భావాలూ ,ఎన్నికబుర్లూ
పూరి , పూరిస్తాయో
అదే కొంచెం ఆందం గావుంటే
వరండా కప్పు అంచున చిన్ని
నీలం పూల లత లల్లు కొంటే
సూర్యోదయం ,చంద్రోదయం
ఉచితంగా చూడొచ్చు

వరండా గోడలకి
రంగు రంగులతో కుట్టిన
చిలకలు కిలకిల లాడుతుంటే
తాటి తోపో , మామిడి తోపో
చిత్రించిన చిత్రం
చిన్నతనాన్ని గుర్తు చేస్తూ
చిరు గాలికి గోడ మీద
కదులుతుంటే
వయసు మరచి ,వేదన మరచి
రేపుని,ఆపై రేపుని
ఆహ్వానించలేమా?
మీకు వరండా లేకపోతే
మనసునే వరండా చేసుకొని
భావాల్నే స్నేహితులు చేసుకొని
గోముగా కబుర్లు చెప్పుకోండి
గడుస్తున్న కాలాన్ని ఔపోసన పట్టండి

★★★



## అవసరమా?
## మూలా వీరేశ్వరరావు

నేను పుట్టిన ఊరు నాకు
ఇప్పుడు పరాయిదయిపోయింది.
నేను మెట్టిన చెరువు
చేరువ కాకుండా దూరమయింది.
ఆత్మీయతా గూళ్ళయిన
పెంకుటిళ్ళు
పుడమి పొరల్లో
జ్ఞాపకాల గూళ్ళు కట్టుకుంటున్నాయి.
బాల్యాన్ని సేద తీర్చిన
చింత చెట్టు గుట్టుగా
మాయమయ్యింది.
మట్టి వాసనని మింగిన
తారు సర్పం విలాసంగా సాగుతోంది.
నా ప్రతిబింబం అదృశ్య మయ్యాక
వలస పక్షులకు
సొంత గూళ్ళ
ఆనవాళ్ళు
అవసరమా ?

★★★

## నువ్వు - నేను
## నాగ్రాజ్

నువ్వురావు
బాధ కల్లలో తుఫానై
చెలరేగుతుంది!
వెన్నెల ఎప్పటికీ
జలపాతాలైన కళ్ళకి
అమావాస్యే!
నీ తలపులు
కిటికీ ఊచలకు
ఉరివేసుకుంటాయి!
ఇప్పటికీ నువ్వురావు
నువ్వైన నేను
గోడకి సాగిలపడిన
శిలను!
నీ గాలైనా రాకపోదా..!?
కళ్ళలో దివిటీలు
వెలిగించుకుని
వెలుగు బాటలు పరిచాను!!

★★★



## దీపం
### వాసుదేవమూర్తి శ్రీపతి

ఆఖరి శ్వాసలు తీసుకుంటోంది దీపం
ఇప్పుడో ఇంకో క్షణానికో
ఆరిపోతానని దానికి తెలుసు,
అయినా తన జవసత్వాలని
కూడదీసుకుని వెలుగుతూనే ఉంది,
వెలిగించినప్పుడు ఎలా నవ్విందో
ఆరిపోయే ముందూ అలానే నవ్వుతోంది,
ఆరిపోతున్నాననే భయం లేదు
తను ఆరిపోతే మరో దీపం
వెలుగుతుందనే ఈర్ష లేదు,
ఆరిపోయాక తనని మర్చిపోతారేమో
అనే ఆలోచనాలేదు,
తనకు తెలిసిందల్లా ఒక్కటే
వెలగడం, వెలిగించడం..
వెలిగించిన వారికి వెలుగివ్వడం
ఆరిపోయేముందు తన విధి
సక్రమంగా పూర్తి చేయగలిగినందుకు
గర్వంగా వెలిగి ఆరిపోవడం,
అది త్యాగం కాదు సందేశం
మనుషులమైన మనం
బ్రతకాల్సిన విధానాన్ని
మనకి తెలియజేసే పాఠం..!!

★★★



## విషాదగీతం
### పి.వి.ఎల్.సుజాత

నేనిప్పుడు..
గతకాలపు జ్ఞాపకాల శిశిరంలో
బందీ అయిన ఒంటరి కోయిలని,
ఇంద్రధనస్సు లాంటి స్వప్నపు
వర్ణాలన్నీ ఒక్కొక్కటిగా విడిపోయి
చీకటి ముసిరిన రాతిరిలా మారిపోయింది,
మనసు గాయపడినప్పుడు
ఓదార్పు నోచుకోని దురదృష్టవంతురాలిని
ప్రమిద ఛాయలో
సమాధి అయిపోయే దీపపు కాంతి
ఎంతవరకూ ప్రసరిస్తుంది..?!
నీ తోడు లేక మాట రాని మౌనాన్నై
భవిష్యత్తు బంధాల బాటలో
వాస్తవాన్ని జతపరుస్తూ
నిర్లిప్తంగా బ్రతుకీడుస్తున్న
శృతి తప్పిన నాదాన్ని!
నిన్ను నిందించే అర్హత
నాకు లేదని తెలిసినా..
"నువ్వు నా సొంతమే" అనే భ్రమలో
గతి తప్పిన గమ్యాన్ని...!?
అయినా సరే...
ఇప్పుడు కూడా స్వరాన్ని సవరించుకుంటూ
నీకై ఓ "విషాదగీతాన్ని" ఆలపిస్తునే వున్నా.

★★★



# రసరేఖలు

శ్రీధర్ బచ్చోటి

ఈ యడవిలోన దాగినవెన్నిపిట్ట
లెన్ని చెట్టులెన్ని సుమములెన్ని గుట్ట
లెన్ని వాగులు లోయలింకెన్ని పక్షు
లెన్ని చరములు వానికింకెన్ని పేర్లు!

సందులో కాలి దారులో యెందునుండి
యెందునకు పోవుచుంటివో యెవ్వరిచట
తాము తిరుగాడుచుందురో ధరణిలోన
యెలిగి ప్రకృతిలో భాగమై యుందురెవరో!

ఇచట తిరుగాడుచుండగానీ వనమ్ము
చిత్రమౌ లోకమన తోచు చిత్తమందు
హృదయముప్పొంగనిట తిరిగెదను నేను
అడవి నాతోడ మాటాడునట్లు తోచు

వనము తోచును తానొక వ్యక్తివోలె
అరయుదును గాని యా మోమునరయలేను
అడుగుజాడలీ నేల కన్పడుచునుండె
అనుసరింతు నెవ్వారినో కనుల చూడ

ఏమి యీ మనస్సు వెదకునెవరి కొరకు
చెంతనుండియు కనరాని చెలియ కొరకొ!
తరలి కనుమరుగైన నేస్తమ్ము కొరకొ!
ప్రకృతికందమిచ్చు వననిర్మాత కొరకొ!



చిత్రం:కె.రామ్మోహన్

COMMENTS